క్లుప్తంగా

పాల ఉత్పత్తిదారుల కమిటీ ఎన్నిక



కుంచమర్తిలో ఎన్నికైన నూతన కమిటీతో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీ నర్సయ్యయాదవ్

అర్వపల్లి : పాడి పరిశ్రమతో రైతులు అభివృద్ధి చెందాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని కుంచమర్తి గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కొత్త మల్లయ్య, డైరెక్టర్లుగా పిట్టల మంగమ్మ, కొత్త సత్యనారాయణ, ఉగ్గం నాగరాజు, మన్నె సైదులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎంపీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఏడు దొడ్ల వెంకట్‌రెడ్డి, పెసర దయాకర్‌రెడ్డి, మన్నె భిక్షం, బత్తుల రాములు, కందుకూరి సైదులు, నాయకులు అలుగుబెల్లి భాస్కర్‌రెడ్డి, తోట జానయ్య, ఎ.లక్ష్మారెడ్డి, గోవర్ధన్, కె.రాజాలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



తుంగతుర్తిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి

తుంగతుర్తి : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండీ సయ్యద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తనయుడు, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన షేక్.లాల్‌హుస్సేన్ కుమారుడికి ఇటీవల తలకు శస్త్ర చికిత్స జరగడంతో వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండెం రాంమూర్తి, ఉప్పుల రాంబాబు, పెద్దబోయిన అజయ్, కొండ రాజు, అక్కినపల్లి రాములు, ఎస్‌కె.జిలాని, ఎండీ అబ్దుల్, నరేష్, వెంకన్న, అప్జల్, వంశీ, కరీం, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి



అనంతారంలో ఏఎన్‌ఎం జానమ్మను సన్మానిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీడీఓ

పెన్‌పహాడ్ : ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని జెడ్పీటీసీ అనిత అన్నారు. గురువారం అనంతారంలోని సబ్‌సెంటర్‌లో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న జానమ్మను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడారు. జానమ్మ దాదాపు 30 సంవత్సరాలు వైద్య సేవలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, మండల వైద్యాధికారి స్రవంతి, ఎంపీటీసీ మామిడి రేవతి, మంగమ్మ, వెంకటరమణ, సబితా, శ్రీలక్ష్మి, బేగం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని ఆత్మకూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఆత్మకూరు, నశీంపేట, దాచారం, తుమ్మలపెన్‌పహాడ్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ గౌతమ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మరమ్మతులు జరుగుతాయని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మద్దిరాల : రెడ్డిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్‌లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తున్నందున శుక్రవారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్‌లో అంతరాయం ఉంటుందని ఏఈ సురేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

సొంతింటి కల నెరవేర్చాలి

నేరేడుచర్ల : రాష్ట్రంలో ప్రతి పేదోడి సొంతింటి కల నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. గురువారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1400 మంది అమరవీరుల త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో నేటికీ ఎక్కడపడితే అక్కడ గుడిసెలు దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు వెంకట్, మహిళా సమాఖ్య నాయకురాలు నూతనగంటి నర్సమ్మ పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ రహదారుల కష్టాలు

- అధ్వానంగా మారిన కొత్తగూడేనికి వెళ్లే రోడ్లు
- ప్రతినెలా ఈ రహదారుల్లో వెళ్లలేక పింఛన్‌దారులు, కూలీల అవస్థలు
- బీటీ రోడ్డును రెన్యూవల్ చేయాలని, లింక్‌రోడ్డును బీటీగా మార్చాలని కోరుతున్న గ్రామస్తులు



గుంతలు పడి అధ్వానంగా మారిన అర్వపల్లి నుంచి కొత్తగూడేనికి వెళ్లే రోడ్డు



కొత్తగూడెం–జాజిరెడ్డిగూడెం లింకు రోడ్డు

అర్వపల్లి : అధ్వానంగా మారిన రహదారులతో మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అర్వపల్లి నుంచి కొత్తగూడేనికి వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై పాదచారులు సైతం నడిచి వెళ్లలేని విధంగా మారింది. అలాగే గ్రామం నుంచి జాజిరెడ్డిగూడేనికి వెళ్లే లింక్‌రోడ్డు కూడా అధ్వానంగా ఉండటంతో కొత్తగూడెం గ్రామస్తులు ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జాజిరెడ్డిగూడెం వెళ్తేనే పింఛన్..

కొత్తగూడెం ప్రజలు ప్రతినెలా ఉపాధి హామీ పథకం బిల్లులు, ఆసరా పింఛన్లు తీసుకోవడానికి జాజిరెడ్డిగూడెం వెళ్తుంటారు. అయితే కొత్తగూడెం నుంచి జాజిరెడ్డిగూడేనికి ఉన్న లింక్‌రోడ్డు మట్టి రోడ్డు కావడంతో వర్షాలకు గుంతలు ఏర్పడి బురదమయంగా మారుతోంది. అంతేకాకుండా కంప చెట్లతో నిండి అధ్వానంగా తయారైంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొత్తగూడెం గ్రామస్తులు ప్రతినెలా అర్వపల్లి మీదుగా జాజిరెడ్డిగూడెం వెళ్తూ ఎంతో వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. గ్రామం నుంచి అర్వపల్లికి వెళ్లే ఆరు కిలోమీటర్ల బీటీ రోడ్డు కూడా పూర్తిగా ధ్వంసమైంది.

దూర, వ్యయ ప్రయాసలు..

కొత్తగూడెం నుంచి జాజిరెడ్డిగూడేనికి వెళ్లే లింక్ రోడ్డు 4కి.మీ దూరం ఉండగా ఈ రోడ్డు దెబ్బతిని అర్వపల్లి మీదుగా జాజిరెడ్డిగూడెం వెళ్లాల్సి వస్తోంది. ఫలితంగా 10కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ప్రతినెలా 60 మంది పింఛన్‌దారులు, 150 మంది ఉపాధిహామీ కూలీలు జాజిరెడ్డిగూడేనికి అర్వపల్లి మీదుగా వెళ్తూ దూర, వ్యయ ప్రయాసలతో ఆందోళన చెందుతున్నారు. కొత్తగూడెం–జాజిరెడ్డిగూడెం లింక్‌రోడ్డును బీటీగా మారిస్తే ఇబ్బందులు తీరుతాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ప్రతినెలా ఇబ్బంది పడుతున్నాం



పింఛన్లు, ఉపాధి బిల్లులను జాజిరెడ్డిగూడెం పోస్టాఫీసులో తెచ్చుకోవాల్సి ఉంటుంది. అయితే తమ గ్రామం నుంచి జాజిరెడ్డిగూడెం వెళ్లే లింక్ రోడ్డు పాడవటంతో అర్వపల్లి మీదుగా 10 కి.మీ దూరం వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా మారింది. లింక్‌రోడ్డును బాగుచేసి ఇబ్బంది తీర్చాలి.

– లింగంపల్లి వెంకటయ్య, కొత్తగూడెం

బీటీ రెన్యూవల్ కాక ఇబ్బందులు



అర్వపల్లి నుంచి కొత్తగూడెం గ్రామానికి వచ్చే 6కి.మీ బీటీ రోడ్డు పూర్తిగా పాడైంది. ఈ రూట్లో ఆటో నడుపుతాను. అయితే రోడ్డుపై వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఆటో నడపడం బంద్ చేశాను. బీటీ రెన్యూవల్ చేయాలి. పింఛన్లు, ఉపాధిహామీ బిల్లులు మా గ్రామంలోనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– రామసాని రవీందర్, కొత్తగూడెం

ఆందోళన చెందొద్దు.. వసతులు కల్పిస్తాం



జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్



ఉయ్యాలవాడలో పాపమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేల్

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. జాజిరెడ్డిగూడెంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను గురువారం ఆయన సందర్శించారు. తరగతి గదులను, పాఠశాల ఆవరణను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులకు తలుపులు లేవని కొత్తవి ఏర్పాటు చేయాలని విద్యార్థులు ఎమ్మెల్యేను కోరారు. బాలురకు మూత్రశాలలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఉయ్యాలవాడలో కాంగ్రెస్ నాయకురాలు పిట్టల పాపమ్మ ఇటీవల మృతిచెందింది. దీంతో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ గురువారం గ్రామాన్ని సందర్శించి మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే జాజిరెడ్డిగూడెంలో ఇటీవల బింగి అంజమ్మ, కొమ్మాలలో మాదం సుందర్‌రెడ్డి మరణించగా వారి కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. ఆయా కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, శిగ నసీర్‌గౌడ్, గుడిపల్లి మధుకర్‌రెడ్డి, దాసరి సోమయ్య, బైరబోయిన మహరాజు, సతీష్‌రెడ్డి, బింగి కృష్ణమూర్తి, నర్సింగ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జూలై 4న దొడ్డి కొమరయ్య వర్ధంతి సభ



తుంగతుర్తిలో దొడ్డి కొమరయ్య వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాస్‌లైన్ నాయకులు

తుంగతుర్తి : జూలై 4వ తేదీన నిర్వహించే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ కోరారు. గురువారం తుంగతుర్తి మండల కేంద్రంలో దొడ్డి కొమరయ్య వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. జూలై 4న మండల కేంద్రంలో జరిగే ర్యాలీ, బహిరంగ సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యులు పేర్ల నాగయ్య, వేర్పుల లక్ష్మయ్య, గొడ్డలి నర్సయ్య, కాసర్ల దుర్గయ్య, వేర్పుల పరశురాం, మామిడి సుధాకర్, కమటం భిక్షం, ఎరసాని అంజయ్య, విజయ్‌రెడ్డి, గోగుల వీరబాబు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల జగ్రత్తలపై అవగాహన



ఫణిగిరిలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది

నాగారం : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ లాటరీలు, బహుమతులు గెలిచారని వచ్చే ఫోన్‌కాల్స్‌ను ప్రజలు నమ్మవద్దని సూచించారు. సైబర్ నేరాల వల్ల అనేక మంది మోసపోయి తమ డబ్బులు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, ఏటీఎం నంబర్లు, ఓటీపీ తదితర వివరాలను బహిర్గతం చేయవద్దని అన్నారు. అపరిచితుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే 100 కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకట్రాములు, సిబ్బందిలు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనకు కృషి



తుంగతుర్తిలోని గిరిజన వసతి గృహంలో మాట్లాడుతున్న డాక్టర్ లింగమూర్తి

తుంగతుర్తి : సికిల్ సెల్ ఎనీమియాను నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మండల వైద్యాధికారి లింగమూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గిరిజన వసతి గృహంలో విద్యార్థులకు సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధి సోకిన వారు రక్తహీనతకు గురవుతారని అన్నారు. జన్యు సంబంధ మార్పుల ద్వారా సికిల్ సెల్ ఎనీమియా వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్త పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రతి లక్షలో నలుగురికి ఈ లక్షణాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ సాయిరాం, వైద్య సిబ్బంది నర్సింహాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తే సహించం

నేరేడుచర్ల : జూలై 10న కార్మికుల కోర్కెల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రాల్లోని గ్రామిక వాడల్లో నిర్వహించే ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. గురువారం నేరేడుచర్ల మండల కేంద్రంలోని అరిబండి భవనంలో జరిగిన హుజూర్‌నగర్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. సీఐటీయూ నేత అనంత ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, ఎలుక సోమయ్య, ఎస్‌కే.యాకూబ్, వరలక్ష్మి, సైదులు, రామ్మూర్తి పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నాగారం : నాగారం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ధార శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల సర్వసభ్య సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పెన్‌పహాడ్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. సర్వసభ్య సమావేశానికి అధికా రులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

30న మండల సర్వసభ్య సమావేశం

నూతనకల్ : ఈ నెల 30న మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య స మావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సునీత తెలిపారు. గురువారం నూతనకల్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

దండోరా రజతోత్సవం కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

చివ్వెంల: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జూలై 7న నిర్వహించే దండోరా రజతోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పడిదల రవికుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన కరపత్రాల ఆవిష్కరణలో పాల్గొని మాట్లాడారు. ఏబీసీడీ వర్గీకరణ కోసం మొదలైన దండోరా ఉద్యమం 30 సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలిపారు. ఆవిర్భావ దినోత్సవానికి మాదిగలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కనుకు జానయ్య, గూడపూరి ఉపేందర్, ఎర్పుల అమ్మయ్య, కొండేటి యేసు, బుర్రి నవీన్, కత్తుల లచ్చయ్య, వరుణ్, లింగయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డితోనే జనరంజక పాలన



మాట్లాడుతున్న అన్నెపర్తి జ్ఞానసుందర్

మద్దిరాల : సీఎం రేవంత్‌రెడ్డితోనే రాష్ట్రంలో జనరంజక పాలన అందుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రామచంద్రాపురంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతుల కష్టమెరిగిన నేత కాబట్టే రైతులకు పంట రుణాలను మాఫీ చేయడంతోపాటు పంటకు రూ.500 బోనస్ ఇవ్వనున్నారని అన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. రైతులు, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరించి అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు అంగిరేకుల వెంకన్న, మాజీ సర్పంచ్ ప్రమీలా, బోయిని తిరుమలేష్, సాయిబాబ, ఉబ్బని జాన్, వెలుగు వీరన్న, మాజీ ఉపసర్పంచ్ అనిత, వెంకట నారాయణ, వి.అంజయ్య, సునీత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం అందజేత



నూతనకల్ : ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

నూతనకల్ : మండల పరిధిలోని పెద నెమిల గ్రామానికి చెందిన గడ్డం వీరస్వామి కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. దీంతో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, మండల కేంద్రానికి చెందిన ప్రవాస భారతీయుడు యాస సత్యనారాయణరెడ్డి గురువారం రూ. 10వేల నగదును పూర్వ విద్యార్థి వీరస్వామికి అందజేశారు. కార్యక్రమంలో బాల్య మిత్రులు కల్లెం శంభారెడ్డి, చిప్పలపెల్లి రవి, బత్తిని లింగయ్య, మూరగుండ్ల సైదులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల పరిధిలోని పోలుమల్ల గ్రామానికి చెందిన తునికి రమేష్ తండ్రి తునికి అవిలయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. దీంతో గ్రామానికి చెందిన రమేష్ బాల్య మిత్రులు, రెబల్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు గురువారం అవిలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.13వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : వెలిశాల గ్రామానికి చెందిన పల్లె యాకమల్లు గౌడ్ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అతడు చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో ఈ విషయాన్ని స్థానిక నాయకులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి స్పందించి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేశారు. మంజూరైన ఎల్‌ఓసీని కాంగ్రెస్ నా యకులు గురువారం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యాకమల్లు గౌడ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుంభం సతీష్ గౌడ్, రమేష్ పాల్గొన్నారు.



మద్దిరాల : పోలుమల్లలో మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న యూత్ సభ్యులు



తిరుమలగిరి : బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సమస్యలపై ప్రశ్నించిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దనియాకుల శ్రీకాంత్‌వర్మ అన్నారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక 60 ఫీట్ల రోడ్డులో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సెంట్రల్ యూనివర్సిటీలో సమస్యలపై ప్రశ్నించినందుకు యూనిట్ కార్యదర్శితోపాటు నలుగురు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను సస్పెన్షన్ చేయడాన్ని, ఐదుగురు యూనివర్సిటీ విద్యార్థులకు రూ.10వేల జరిమానా విధించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ వీసీ, పాలకవర్గం కక్షతో విద్యార్థి నాయకులపై, విద్యార్థులపై అక్రమ కేసులు మోపడం అప్రజాస్వామికమన్నారు. సస్పెన్షన్ ఎత్తివేయకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ వినోద్ కుమార్, దిరావత్ వెంకటేష్ నాయక్, వినయ్, తన్వేష్, వంశీకృష్ణ, గోపి, గౌతమ్, అరుణ్, వరుణ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి



తిరుమలగిరిలో రికార్డులను పరిశీలిస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్

తిరుమలగిరి : ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులను తీసుకెళ్లే బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని సూర్యాపేట మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ కోరారు. గురువారం తిరుమలగిరిలో స్కూల్ బస్సులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఓ స్కూల్ బస్సును సీజ్ చేసినట్లు తెలిపారు. మరో బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు దాటడంతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం అన్ని రికార్డులు ఉండాలని స్కూల్ యాజమాన్యానికి సూచించారు. సీనియర్, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న డ్రైవర్లు మాత్రమే స్కూల్ బస్సులు నడపాలని అన్నారు. బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక రక్షణ పరికరాలు ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మల్లిఖార్జున స్వామి ఆలయ వార్షికోత్సవం



పసునూర్‌లో జల బిందెలతో వెళ్తున్న మహిళలు

నాగారం : మండల పరిధిలోని పసునూర్ గ్రామంలో భ్రమరాంబిక సమేత మల్లిఖార్జున స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని భక్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. తొలిరోజు జలాధివాసం సందర్భంగా మహిళలు 108 రాగి బిందెలతో ధ్వజస్తంభానికి జలాభిషేకం చేశారు. అనంతరం భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శుక్రవారం ఆలయంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం, నవగ్రహ మండపారాధన, శాంతికళ్యాణం, తీర్థప్రసాదాల వినియోగం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వినయ్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థను రద్దుచేయాలి

తుంగతుర్తి : ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థను రద్దు చేసి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జెడ్పీచైర్మన్‌ల పదవీకాలం జూలై మొదటి వారంలో ముగుస్తుందని అన్నారు. తిరిగి ఎన్నికలు నిర్వహించే నాటికి ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఐదు అంచెల వ్యవస్థను రద్దుచేసి మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాలను కోరారు. మున్సిపల్, సింగిల్ విండో చైర్మన్‌లను సైతం ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకునే విధంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా కొంత మేరకు పార్టీ ఫిరాయింపులను నివారించి, ప్రజలకు సరైన పాలన అందించవచ్చని తెలిపారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, శ్రీనివాస్, వెంకన్న ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి నివాళి

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మలికంటి సత్తయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. దీంతో కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు హమీద్, మాజీ ఎంపీటీసీ అండెం రజిని మల్లయ్య గురువారం కార్యకర్తలతో కలిసి సత్తయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, తీగల సైదులు, తీగల ఉమేష్, మామిడి మహేష్, వేణు, భిక్షం, మనోజ్, యాకయ్య, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ కెమిస్ట్‌కు నివాళి

అర్వపల్లి : మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన గొడిశాల కిరణ్ సంగారెడ్డి జిల్లాలోని ఓ పరిశ్రమలో కెమిస్ట్‌గా పనిచేస్తూ అకాల మరణం చెందారు. దీంతో గురువారం అతడి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకరాగా కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, మాజీ ఉపసర్పంచ్ పులిచర్ల ప్రభాకర్, బింగి శ్రీకాంత్, సతీష్‌రెడ్డి, అమీనుద్దీన్, కోటిప్రసాద్, సంపత్, రమావత్ లాలునాయక్ ఉన్నారు.

ఘన జీవామృతంతో నేల సారవంతం

నడిగూడెం : ఘన జీవామృతంతో నేలసారం పెరుగుతుందని నారాయణపురం గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు నాగిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. గురువారం సిరిపురం రైతు వేదికలో మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నాబార్డు ఆర్థిక సహకారంతో పొదుపు సంఘాల సభ్యులకు సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నాగిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడారు. ఒక ఎకరానికి ఆఖరి దమ్ములో ఆవు పేడ, ఆవు మూత్రం, బెల్లం, పప్పుల పిండి, పిడికెడు పుట్ట మట్టితో తయారు చేసిన ఘన జీవామృతం వేస్తే నేలలో బలం పెరుగుతుందని తెలిపారు. రసాయన ఎరువులు వేయాల్సిన అవసరం ఉండదన్నారు. నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

మునగాల : కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 30, జూలై ఒకటవ తేదీల్లో సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే జిల్లాస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు కోరారు. గురువారం మునగాల మండల కేంద్రంలో శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. శిక్షణ తరగతుల్లో కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, శ్రీను, పరశురాములు, చిరంజీవి, బాలాజీ, నాగార్జున పాల్గొన్నారు.